రేషన్ కష్టాలు షురూ



గాంధీనగర్‌లో రేషన్ షాపు గుమ్మం వద్ద వృద్ధురాలి పడిగాపులు

ప్రతి నెలా ఇంటి ముంగిటిలోకి వచ్చి రేషన్ ఇచ్చే రోజులు పోయాయి. రేషన్ షాపులకు వెళ్లి గంటలు తరబడి నిలబడి బియ్యం బస్తాలు మోసుకునే రోజులు మళ్లీ మొదలయ్యాయి. ఆదివారం ప్రారంభించిన రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఎక్కడ చూసినా రేషన్ షాపుల వద్ద మహిళలు పడిగాపులు కాస్తూ కనిపిస్తున్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటికి తీసుకువచ్చి ఇస్తామన్న కూటమి నాయకులు మాటలు ఆచరణలో అమలు కావడం లేదు. ఉదయం షాపులు తెరిచి మమ అనిపించి...సాయంత్రానికి మూసివేశారు. వృద్ధులు గుమ్మం వద్ద ఎదురుచూపులు చూస్తే దివ్యాంగులు రేషన్‌షాపునకు రావడం తప్పలేదు. ఆదివారం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన రేషన్‌షాపుల వద్ద మహిళలు, వృద్ధుల ఇక్కట్లలో కొన్ని చిత్రాలు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



కొత్తపేటలో రేషన్ షాపు వద్ద వృద్ధుల పడిగాపులు



తంగెళ్లమూడిలో వేలిముద్ర వేస్తున్న వృద్ధురాలు



ఏలూరు చేపల తూము సెంటరులో రేషన్ షాపు వద్ద పడిగాపులు



రేషన్ బియ్యం మోసుకుంటూ వస్తున్న మహిళ



బీడీ కాలనీలో రేషన్ కోసం దివ్యాంగుల ఎదురుచూపులు

క్లుప్తంగా

అలరించిన బాలు గాన లహరి



బాలు గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధుర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలు గాన లహరి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వివిధ చలనచిత్రాల్లో ఆలపించిన సూపర్‌హిట్ గీతాలను గాయకులు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

నేడు చింతలపూడిలో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్

ఏలూరు(మెట్రో): చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కూడా యథావిధిగా సంబంధిత అధికారులతో పీజీఆర్ఎస్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



ఆధ్యాత్మిక చింతనపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ముందుగా చిన్నారులకు చదవటం మాకిష్టంలో భాగంగా పుస్తకపఠనం చేయించి వివిధ రకాల నీతికథలను చదివించి, వారి చేత కథలు చెప్పించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ డీ. శ్రీవల్లి చిన్నారులకు సరస్వతీ దేవి శ్లోకాల అర్థాలను చెప్పి ఆధ్యాత్మికత వైపు చిన్నారులు అడుగులు వేయాలని సూచించారు. అలాగే ప్రతి విద్యార్థీ గ్రంధాలయం సభ్యత్వం పొందాలని కోరారు. అనంతరం చిన్నారులతో సందడిగా సరదా ఫన్నీ గేమ్స్ ఆడించారు. శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణ రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, బీవీఎస్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి విశ్వబ్రాహ్మణులు ఆర్థిక సాయం సాయం అందించారు.ఆదివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో చిట్టూరి సత్యనారాయణ కుటుంబానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) అందచేశారు. కమ్మరి వృత్తి ద్వారా జీవనం సాగించే చిట్టూరి సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన రెండవ కుమార్తె వివాహం చేసేందుకు తగిన ఆర్థిక స్థోమత లేక విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివశ్రీని ఆశ్రయించగా శివ శ్రీ విజ్ఞప్తి మేరకు విశ్వబ్రాహ్మణ సంఘీయులు విరాట్ సేవా ట్రస్ట్, వెస్కో ట్రస్ట్, ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం, శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం, వడ్రంగిపనివారల సంక్షేమ సంఘం సభ్యులు, షుమారు లక్షా ఏభై వేల రూపాయలు ఖర్చుతో వివాహం జరిపించేందుకు ముందుకొచ్చారు. ఆదివారం సంఘీయుల సమక్షంలో కొంత నగదును ఆ కుటుంబానికి అందజేశారు.



వివాహ ఖర్చులకు సంబంధించిన నగదు అందిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు లక్కోజు వెంకటేశ్వరరావు (కొండబాబు), ప్రధాన కార్యదర్శి లంకలపల్లి జగదీష్, విరాట్ సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్తల శివకుమార్, ట్రస్ట్ సభ్యులు, వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్లూరి శివరావు, సంఘం నాయకులు అద్దంకి సత్యన్నారాయణ, కామకోటి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ యాత్ర

ఏలూరు రూరల్: ప్రపంచ సైకిల్ యాత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ సైకిల్ ర్యాలీలో పాల్గొనాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ సందీప్ అన్నారు. ఆదివారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అధారటీ ఆఫ్ ఇండియా మేరా యువభారత్(ఎన్‌వైకె) ఆధ్వర్యంలో ఏలూరులో సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సాయ్ సెంటర్ నుంచి తంగెళ్లమూడి సర్కిల్ వరకూ కొనసాగిన ర్యాలీలో క్రీడాకారులు, మేరా యువ భారత్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోచ్ సందీప్ మాట్లాడుతూ యువత శారీరకంగా, మానసికంగా బలంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందుకోసం క్రీడల యోగా, సైకిల్ సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ వలంటీర్లు చేతన ప్రసన్న, దత్తజగదీష్, రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి గుర్తింపు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై కలపర్రు పాతటోల్‌ప్లాజా సమీపంలో ముందుగా వెళ్తున్న కారు ఆకస్మికంగా బ్రేక్ వేయటంతో వెనుక మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు కారును ఢీకొనటంతో తీవ్రగాయాలతో మృతిచెందాడు. మృతుడి వివరాలను పోలీసులు ఆదివారం గుర్తించారు. మే 31న రాత్రి వేళ కలపర్రు పాతటోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గణపవరం మండలం కుమ్మర గ్రామానికి చెందిన అడ్డగళ్ళ శ్రీనివాసరావు (35) విజయవాడ నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఏలూరు జీజీహెచ్ మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు చేతివృత్తిదారుల సంఘం జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి దారుల సంఘం ఏలూరు జిల్లా కార్యకర్తల సమావేశం మంగళవారం ఏలూరులో నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న చేనేత, కమ్మరి, కుమ్మర, నాయీబ్రాహ్మణ, రజక, దర్జీ, విశ్వబ్రాహ్మణ తదితర వృత్తుల వారు సరైన ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారులకు ప్రభుత్వాల నుంచి అందే సంక్షేమ పథకాలు అరకొరగా ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఏలూరు స్ఫూర్తి భవనంలో జరిగే జిల్లా సమావేశంలో చేతి వృత్తి దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు.

రేపటి నుంచి వ్యవసాయ విద్యుత్‌లో మార్పులు

భీమడోలు: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని అగ్రికల్చర్ కనెక్షన్ల లోడ్లను రెండు గ్రూపులుగా విభజించి విద్యుత్ సరఫరా చేస్తామని ఆ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. భీమడోలులో ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఏ గ్రూపులో తెల్లవారు జాము నాలుగు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బీ గ్రూపుకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

ప్రమాద స్థలాలను పరిశీలించిన డీఎస్పీ

దెందులూరు: జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే స్థలాలను ఆదివారం నూజివీడు డీఎస్పీ ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం అర్ధ రాత్రి జాతీయ రహదారిపై నాగ హనుమాన్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన బస్సు బోల్తా ప్రమాద వివరాలను దెందులూరు ఎస్సై ఆర్.శివాజీని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలు, బంకులు ఇతర ప్రదేశాల్లో వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నిలుపుదల చేయకుండా నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు శాఖపరమైన సూచనలను చేశారు.

'వెన్నుపోటు దినం' వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏలూరు నియోజకవర్గ నాయకులు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాలను వివరిస్తూ ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ఏలూరు నియోజకవర్గంలోని ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్(జేపీ) పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగం 4న ఉదయం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పాత బస్టాండ్, వసంత మహల్, జ్యూట్‌మిల్లు, ఫైర్ స్టేషన్ సెంటర్‌లు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. ఏడాదిగా కూటమి ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా, సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని కోరుతూ, ప్రజలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై నిత్య దాడులను నిరశిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జీ కారుమూరి సునీల్ కుమార్, ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, కిలాడి దుర్గారావు, మున్నుల జాన్ గురునాథ్, స్టాన్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి


ఏలూరు (టూటౌన్): మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. ఆదివారం నషాముక్త్ భారత్ అభియాన్, అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఈగిల్ టీమ్, వైద్య ఆరోగ్యశాఖ, సంయుక్త ఆధ్వర్యంలో వట్లూరు సీఆర్‌ఆర్ మహిళా కళాశాల నుండి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన 5కె వాక్ థాన్ ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు అనంతరం వాక్ థాన్ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరిచిన 5 మంది పురుషులకు, 5 మంది మహిళలకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు,



5కే వాక్‌థాన్‌లో పాల్గొన్న వివిధ శాఖల ఉద్యోగులు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివ రామ్మూర్తి, డీఎస్‌టీఓ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కుమార్, మున్సిపల్ కమిషనరు ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సందర్శన



డంపింగ్ యార్డును సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో రేషన్ షాపు పునః ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు, జేసీ పి.ధాత్రిరెడ్డి చేబ్రోలులో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చేబ్రోలు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు, సర్పంచ్ సునీత, తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బిక్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	48
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	22	అల్లం	68
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	05
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	02
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.40	98507	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

నిర్వహణ లోపం.. రహదారికి శాపం



గణపవరం ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్



బావాయిపాలెం రోడ్డులో చాణక్య జూనియర్ కళాశాల వద్ద గోతులు..గుంతలు

- గత ప్రభుత్వంలో రూ.3 కోట్లతో నిర్మించి, నిర్వహణ
- కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహణపై నిర్లక్ష్యం
- గణపవరం-క్రొవ్విడి రహదారిలో ప్రజల అవస్థలు

నిడమర్రు: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బావాయిపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్వహణ లోపంతో అడుగడుగునా ప్రమాదకరంగా తయారైంది. 2023 ముందు దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న ఈ రహదారిని నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో నూతన రహదారి నిర్మించి, నిర్వహణ చేశారు. అనంతరం ప్రభుత్వం మారింది కానీ ఈ రహదారి వెంబడి కనీస నిర్వహణ మరమ్మతులు చేయకపోవడంతో ఈ రహదారి వెంబడి మార్జిన్లు కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మార్జిన్‌లు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడంలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చాణక్య కాలేజీ, ఇందిరమ్మ కాలనీ, పుంతలో ముసలమ్మ గుడి, చైతన్య స్కూల్ వంటి ప్రాంతాల్లో రోడ్డు మరీ దారుణంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నట్లు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాలతో రద్దీ

ఈ రహదారి ఆకివీడు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో గణపవరం మీదుగా ఆకివీడు, కైకలూరు వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారి వెంబడే వెళుతుంటాయి. గణపవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లాలంటే మరో 7 కిలోమీటర్ల వరకూ దూరం పెరుగుతుంది. దీంతో ఈ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా ఉంది. ఈ రహదారి వెంబడే కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఉండటంతో ఉదయం సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులతో రద్దీగా ఉంటుంది. అసలే ట్రాఫిక్ సమస్య దీనికి తోడు రోడ్డు గోతులు, గుంతలతో ఉండటంతో ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో 2023లో గణపవరం మహాలక్ష్మి కూడలి నుంచి క్రొవ్విడి వరకూ ఈ ఆర్అండ్‌బీ రహదారిని రూ.3 కోట్ల నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రహదారి నిర్వహణపై పాలకులు ఎటువంటి శ్రద్ధ పెట్టకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకూ అధ్వానంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.